◆ ఈ వారం కథ

# జోస్యం

ప్రఫుల్ల చంద్ర

వెయిటింగ్ రూంలో సుమారు పదిమంది నిరీక్షిస్తున్నారు. హోదాకు తగినట్టు కొందరు కుర్చీల్లో కూర్చుంటే కొందరు బెంచిమీద, మరికొందరు నిల్చుని వున్నారు. నిశ్శబ్దంగా తిరుగుతున్న చిన్న సీలింగ్ ఫాన్ గాలి చాలక కొందరు ఆపసోపాలు పడుతోంటే మరికొందరు బయట వరండామీద నిల్చున్నారు.

గది నిరాడంబరంగా వుంది.


కుర్చీలో కూర్చున్న కోటీశ్వరరావు అసహనంగా మాటిమాటికీ టైమ్ చూసుకుంటున్నాడు. గోడలకు వేలాడుతున్న దేవతల కాలెండర్లు చూస్తున్నాడు. ప్రముఖ వ్యాపారి, కోటీశ్వరుడూ అయిన ఆయనకు ప్రతి నిమిషమూ రూపాయిలతో ముడిపడి వుంటుంది మరి. అయితే, ఈ వెయిటింగ్ రూంలో అందరూ సమానమే. క్రమ పద్ధతిలో లోనికి వెళ్ళవలసిందే.

అయితే ఒక పేద బ్రాహ్మడి యింటిలో కోటీశ్వరుడైన తను అలా నిరీక్షించవలసి రావడం కాదు ఆయన బాధ. ఎవరు లోనికి వెళ్ళినా పది నిమిషాల్లో బయటకు వచ్చేస్తున్నారుగాని తన ముందున్నవాడు లోనికి వెళ్ళి పావుగంట దాటింది. అయినా బయటకు రాలేదు. అతగాడు బయటికొస్తేనే తను లోనికి వెళ్ళాలి. అదీ ఆయన ఆత్రానికి కారణం.

చివరకు అతగాడు రానూ వచ్చాడు. ఈయన లోనికి వెళ్ళనూ వెళ్ళాడు.

పదేళ్ళుగా పరిచయం అయిన పరిసరాలే అయినా, లోనికి అడుగుపెట్టగానే ఓ క్షణం తన్మయంగా అలాగే వుండిపోయాడు కోటీశ్వర రావు.

ఎదురుగా గోడకు రంగులు వెలిసిపోయిన సరస్వతి విగ్రహం. దానికి బంతిపూదండ. సరిగా ఆ విగ్రహం కింద చాప మీద పద్మాసనంలో కూర్చున్న పంతులుగారు. నుదుట చందనపు బొట్టు, చందనం మధ్య కుంకుమ బొట్టు.



నిగనిగలాడుతున్న నున్నని గుండు. వెనుక గోష్పద పరిమాణంలో పిలక, కట్టుకున్నది మాసిపోయిన పట్టుపంచె అయినా పుంభావ సరస్వతిలా దివ్య తేజస్సుతో వెలిగి పోతున్నారాయన.

ఆయన ఎదుట చిన్న వ్రాతబల్ల. దానిమీద ఒకవైపు పంచాంగాలకట్ట. రెండోవైపు కలం, సిరాబుడ్డీ.

కోటీశ్వరరావు నమస్కరించగానే కూర్చోమన్నట్లు సంజ్ఞ చేశారు పంతులుగారు. ఆయన ఎదుట ఎవరైనా చాప మీదనే కూర్చోవాలి. ఇబ్బందిగా కూర్చున్నాడు కోటీశ్వరరావు.

ఇక బిడ్డలు పుట్టరు అని నిరాశ చేసుకున్న సమయంలో కోటేశ్వరరావుకి కొడుకు పుట్టాడు. కొడుకు జాతకం తెలుసుకోడానికి వచ్చాడాయన. పుట్టిన తేదీ, సమయం, స్థలం అన్నీ వివరించాడు. అనుమానానికి ఆస్కారం లేకుండా, వాచీని సరిచేసుకుని బిడ్డ ఏడుపు వినగానే టైమ్ నోట్ చేసుకున్నాడు.

పంతులుగారు పంచాంగం తెరిచి లెక్కలు కడుతున్నంతసేపు-పరీక్షా ఫలితం కోసం నిరీక్షిస్తున్న విద్యార్థిలాగ గుంజాటన పడిపోయాడు కోటేశ్వరరావు.

కోటేశ్వరరావుది విచిత్ర తత్వం. దేవుడంటే నమ్మకం లేనట్టు మాట్లాడుతాడు. ఎందుకైనా మంచిదన్నట్లు పూజలూ, వ్రతాలూ చేస్తాడు. విభూతి రాసుకున్న చేతితోనే విస్కీ అందుకోగలడు. అవసరం అయితే ప్రత్యర్థుల కొంపలు ముంచగలడు. అయితే ఆ పని చేసేముందు భక్తిగా పూజలు చేస్తాడు. పని పూర్తయాక మరింత భక్తిగా తిరుపతి వెళ్తాడు.

లెక్కలు కడుతున్న పంతులగారి ముఖం గంభీరంగా మారిపోయింది. భృకుటి ముడిపడింది. కోటేశ్వరరావుకి విషయం అర్థమయింది.

లేకలేక కలిగిన సంతానం అల్పాయుష్కుడైతే తన ఆస్తి ఏం కావాలి!

కోటేశ్వరరావు గుండెల్లో కోటి బండలు దొర్లిపడ్డాయి. గొంతు తడారిపోయింది. అల్పాయుష్షు అంటే ఎంతకాలం? ఒక నెలా? రెండు నెలలా? ఒక సంవత్సరమా?

''గ్రహశాంతి చేస్తే కొంత మేలు'' చివరకు అన్నారు పంతులుగారు.

అంత విషాదంలోనూ నవ్వొచ్చింది కోటేశ్వరరావుకి. ఈ భూప్రపంచంలో అయితే ఏ పని అయినా లంచంతో సాధించవచ్చు. దేవలోకంలో కూడా అంతేనా? శాంతి అంటే లంచం కాక మరేమిటి?

అయితే ఆ నవ్వు ముఖంలో కనబడనీయకుండా "ఆ గ్రహ శాంతి ఏదో మీరే స్వయంగా నిర్వేసి ఘనంగా జరిపించండి" అన్నాడు.

పంతులుగారున్నది అందుకే కదా! శాంతి ఘనంగా జరిపించారు.

అయితే పంతులుగారి జోస్యాన్ని కోటేశ్వరరావు ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నాడో ఏమో-కుర్రాడు చిర్రువ చీదితే చాలు డాక్టర్‌కి, తుస్సుమని తుమ్మితే చాలు స్పెషలిస్ట్‌కీ చూపించి కవచంలా కాపాడుకుంటూ వచ్చాడు.

అబ్బాయి వయస్సు ఐదు దాటింది. పదీ దాటింది. పాతికా వచ్చింది. లక్ష్మీపతికి ధైర్యంగా వివాహం చేశాడు కోటేశ్వరరావు. మరో పని ఏదీ లేనట్టు లక్ష్మీపతి కూడా కోటేశ్వరరావుని తాతయ్యను చేసి మూల కూర్చోబెట్టాడు ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, నాణ్యంగా నాలుగుసార్లు!

కొడుకు వివాహానికీ, మనవల బారసాలలకూ పంతులుగారే ఆధ్వర్యం వహించినా—''అబ్బాయి అల్పాయుష్కుడని జోస్యం చెప్పారే, యిప్పుడేమంటారు?'' అని దెప్పి పొడవలేదు కోటేశ్వరరావు. పరమ లౌక్యుడు, పైగా వ్యాపార వేత్త.

అయితే భార్యవద్ద మాత్రం "వీళ్ళ జోస్యాలన్నీ యిలాగే వుంటాయి" అన్నాడు వేళాకోళంగా. వినకూడని మాట విన్నట్టు చెవులు మూసుకుని నోరు తెరిచిందామె. ''శాంతి చేయించాం కదా, అందుకే కీడు తొలగిపోయింది''

"నీ ముఖం! అబ్బాయిని కాపాడింది గ్రహాలు కాదు, డాక్టర్లు!'' అన్నాడు.

"మీకేం తెలియదు ఊరుకోండి! మనం శాంతి చేయించాం గనుకనే ఆ గ్రహాలు డాక్టర్లలో ప్రవేశించి అబ్బాయిని కాపాడాయి'' బుస్సుమందామె.

'శాంతి చేయించగానే ఫలితాలు మారిపోతే యిక విధి బలీయం అనే మాటకు అర్థం ఏమిటి' అని అడగాలనిపించిందాయనకు. కాని భార్యతో వాదించడం ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసిన అనుభవజ్ఞుడు కనుక మౌనం వహించాడు.

వెయిటింగ్ రూంలో సుమారు పదిహేను మంది నిరీక్షిస్తున్నారు. అందరూ కుర్చీల్లో సుఖాసీనులై వున్నారు. చినకోటేశ్వరరావు చిన్నవాడేం కాదు. నలభై ఏళ్ళవాడు! ప్రఖ్యాత వ్యాపారి కోటేశ్వరరావుకి మనవడు. లక్ష్మీపతి కొడుకు.

లక్ష్మీపతికి యిద్దరు కొడుకులు. ఇద్దరు అల్లుళ్ళు. అందరూ వ్యాపారంలోనే వున్నారు. ఆరోగ్యకరమైన పోటీ పడడం కోసం వాళ్ళకి కాస్త స్వతంత్రం యిచ్చాడు లక్ష్మీపతి. ఐ.ఎం.ఎఫ్.లాగ తను వాళ్ళకి కొన్ని నిబంధనలతో కావలసినంత డబ్బు అప్పుగా యిచ్చాడు. ఆ పెట్టుబడితో వాళ్ళు నచ్చిన వ్యాపారం ప్రారంభించవచ్చు. సంవత్సరాంత సమీక్షలో ఎవరి సమర్థత వాళ్ళు నిరూపించుకోవాలి.

చినకోటి సిమెంట్ వ్యాపారం ప్రారంభించాడు. అయితే, ఆ సిమెంట్‌తో కట్టిన బిల్డింగ్ కూలిపోవడంతో నష్టపరిహారం కోరుతూ ఫోరంలో కేసు పెట్టి గెలిచాడు. దానితో ఆ వ్యాపారం ఆగిపోయింది.

తండ్రివద్ద మళ్ళీ అప్పుచేసి — ఇది ఎలక్ట్రానిక్స్ యుగం కదా అని రేడియో, టీవీల షాపు ప్రారంభించాడు చినకోటి. కాని వాటి డిమాండ్ తగ్గిపోయి వ్యాపారం మందగించింది.

ఇలా అతగాడు దేనిలో చెయ్యి పెడితే అదే నాశనం అవుతుంటే తండ్రి తిట్టడం ప్రారంభించాడు.

కొత్త అప్పులు ఇవ్వనని బెదిరించాడు. మిగిలిన ముగ్గురూ దినదినాభివృద్ధి చెందుతుంటే తన పరిస్థితే యిలా వుంది.

ఇంటిలో బావలకు, అన్నయ్యలకు, ఆడవాళ్ళకూ, చివరకు ఆలికీ లోకువ అయిపోయాడు చినకోటి. తండ్రి చస్తేగాని తనకీ అవమానాలు తప్పవనుకున్నాడు. అప్పుడు తన వాటా ఆస్తి తీసుకుని తిట్లూ శాపనార్థాలూ లేకుండా సర్వస్వతంత్రంగా జీవించవచ్చు.

అయితే అల్పాయుష్కుడనిపించుకున్న తండ్రి డెబ్బయి దాటినా చచ్చిందీ లేదు, ఆస్తిలో తన

## మునిమాణిక్యం చమత్కారాలు



మునిమాణిక్యంగారు "భార్యను లొంగదీసుకోవడం ఎలా?" అనే పుస్తకం వ్రాశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పరిమళా సోమేశ్వర్ (నవలా రచయిత్రి)గారు "భర్తను లొంగదీసుకోవడం ఎలా?" అనే పుస్తకం వ్రాసి మార్గదర్శకులైన మునిమాణిక్యంగారికే అంకితం చేశారు. ఈ అంకితోత్సవ కార్యక్రమాన్ని చూసిన పండిట్ ట్రైనింగ్ కాలేజి విద్యార్థి ఒకాయన (పెళ్లైనవాడు) క్లాసులో మునిమాణిక్యంగారిని "భర్త భార్యను లొంగదీసుకోలేనప్పుడు ఏం చెయ్యాలి" అని అడిగాడు. వెంటనే మునిమాణిక్యంగారు "భార్యకు లొంగిపోవాలి" అనడంతో క్లాసులో నవ్వులజల్లు కురిసింది.

—మసన చెన్నప్ప

# ఎగసాయం జోకులు

× పాత–కొత్త

వ్యవసాయదారుడైన తండ్రి కొడుకు పెళ్ళి గురించి వాదించి వాదించి "మా కాలంలో మా పెద్దల మాట జవదాటి ఎరగం. మీలాగా కాదు" అని గయ్‌మన్నాడు.

"నువ్వు చెప్పినట్టు వింటాను. నేను చెప్పినట్టు చేస్తావా?" అన్నాడు కొడుకు వెంటనే. తండ్రి తలూపాడు.

"నువ్వు ప్రస్తుతం పండిస్తున్న కొత్త వరి రకాన్ని వదిలేసి మీ తాతలనాటి అక్కుళ్ళు, కృష్ణకాటుకలు, వంకసన్నాలు సాగుచెయ్యి ఇక నుండి. వింటాను" అనేసరికి ఆ జనకుడు కొయ్యబారిపోయాడు.




నిక్‌నేమ్

ఇద్దరు రైతులు హడావుడిగా వ్యవసాయ డిపోకొచ్చి గుమాస్తాతో "మాకు 'కాకిరెక్కలు–ఎమర్జెన్సీ' విత్తనాలు కావాలి" అన్నారు.

"అసలా పేరున్నవి పుట్టలేదు" అన్నాడు గుమాస్తా.

"మమ్మల్నే వెర్రోళ్ళని చేద్దామనుకుంటున్నావా?" అంటూ రైతులు గొంతుపెంచారు. అప్పుడే వచ్చిన వి.ఇ.ఒ. విషయం తెల్సుకుని నవ్వేసి "6024 వరి కాకి నలుపులో వుంటుంది. కాబట్టి 'కాకిరెక్కలు' అని, 1444 తక్కువ రోజుల్లో కోతకి వస్తుంది గనుక 'ఎమర్జన్సీ' అని రైతాంగం అనుకుంటుంటారు. వాడుకలో అవే పేర్లు నిలబడిపోయి అసలు పేర్లు మరుగునపడ్డాయి" అని విపులీకరించి విత్తనాలు ఇచ్చి రైతుల్ని పంపేసారు.

— మాధవరపు కృష్ణ, తణుకు

వాటా వచ్చిందీ లేదు. కారుమబ్బుకి వెండి అంచులాగ చివరకు తండ్రి మంచం పట్టాడు. ఇదిగో అదిగో అన్న సంతోషమేకాని, ఆ ముసలాడు మంచం మీదనే రెండు నెలలుగా బతికేస్తున్నాడు.

ఏదో రోజు చెంగున మంచం దూకి నర్సింగ్ హోం నుంచి ఇంటికి వచ్చేస్తాడేమో కర్మ!

'అతగాడు ఎప్పుడు పోతాడు? ఆస్తి తన చేతికెప్పుడొస్తుంది? అసలు — జీవితంలో తను సుఖపడగలడా?' — ఇవి తెలుసుకోడానికే చిన పంతులు వద్దకు వచ్చాడు చినకోటి. అరగంట నిరీక్షించాక అతనికి పిలుపొచ్చింది.

గదిలో అడుగు పెట్టగానే — ఎదురుగా గోడకి బిగించిన అద్దాల పెట్టెలో బంధింపబడిన లక్ష్మీ సరస్వతి గణపతుల వెండి విగ్రహాలు. వాటికి చెమికీ దండలు. సరిగా ఆ అద్దాల పెట్టె కింద కుర్చీలో కూర్చున్న చినపంతులుగారు.

ఆనాటి పంతులుగారి మనవడే యీయన. తాతగారికి, ఈ మనవడికీ నుదుట గంధం కుంకుమ బొట్టులో తప్ప మరే విషయంలోనూ సామ్యం లేదు. తాతగారిది ముండన మస్తకం అయితే మనవడిది గిరిజాల క్రాప్. ఆయనది బ్రహ్మ తేజస్సు అయితే ఈయనది లక్ష్మీకళ! ఆయన షర్టు ధరించి ఎరుగరు. ఈయన చందన వర్ణపు లాల్చీ ధరిస్తాడు. పెద్దాయన నోట్లోంచి ఎప్పుడూ ఆంగ్ల పదం వెలువడలేదు. ఈయన ఇంగ్లీషు దొర్లించేస్తారు. ఇంటర్ వరకూ చదివిన వాడాయె.

ఈయన ఎదురుగా టేబుల్. దానిమీద ఒక ప్రక్క పంచాంగాల కట్ట, రెండో ప్రక్క బాల్ పెన్, కాలిక్యులేటర్.

పెద్దాయనతో మాట్లాడడానికే భయపడే వారంతా. కానీ ఈయనతో వేళాకోళాలు ఆడడాన్కి కూడా సాహసిస్తారు కొందరు.

చినకోటి గదిలో ప్రవేశిస్తూనే "నమస్కారం పంతులుగారూ" అని నోటితో అన్నాడుగాని చేతితో నమస్కరించకుండానే ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. "మా నాన్న అల్పాయుష్కుడని మీ తాతగారు జోస్యం చెప్పారుగాని ఆ ముసలాడు డెబ్బయి దాటినా చెక్కు చెదరలేదు. దేవుడు కరుణించి ఇప్పుడు మంచం ఎక్కాడు. డాక్టర్లేమో నేడో, రేపో అంటున్నారుగాని ఆయన గారేమో మంచం మీది మరచెంబు లాగ సెటిల్ అయిపోయాడు" అన్నాడు నవ్వుతూ.

"మా తాతగారి జోస్యాన్ని నిందించకండి. జనన కాలం ఒక నిమిషం తేడాతో వున్నా జోస్యం తప్పిపోతుంది" అన్నారు చినపంతులు రోషంగా.

"అలాంటి తేడా ఏమీ లేదు. మా తాతగారు టైమ్ విషయంలో ఎంత ఖచ్చితంగా వుంటారో నాకు తెలుసు."

"పూర్ణాయుష్షు అంటే వంద సంవత్సరాలు. అందుకు ఒక్క రోజు తగ్గినా అల్పాయుష్షే"

"అలా అయితే మనుషులంతా అల్పాయుష్కులే" అందామనుకొన్నాడు చినకోటి. కాని పంతులుగారికి కోపం వచ్చిందని గ్రహించి ప్రసంగం మార్చేశాడు. "అదంతా ఎందుకుగాని మీరు చెప్పండి — 'ఆ ముసలాడు ఎప్పుడు పోతాడు? ఆస్తి నా చేతికెప్పుడొస్తుంది? నేను సుఖపడతానా?'"

పంతులుగారు కాసేపు ఆలోచించి "కంప్యూటర్ జోస్యం కావాలా? కాలిక్యులేటర్‌తో కాని చేద్దామా?" అని అడిగారు.

కంప్యూటర్ జోస్యానికి రేటు ఎక్కువ! అయినా కంప్యూటర్ జోస్యమే కావాలన్నాడు చినకోటి రెండు వందలు టేబుల్ మీద పెడుతూ. కావలసిన వివరాలు ఇచ్చాడు.

ప్రక్క గదిలో తూర్పు దిక్కుగా గోడకు వెండి సరస్వతిదేవి విగ్రహం వుంది. దాని కింద టేబుల్ మీద టీవీ సైజులో పెర్సనల్ కంప్యూటర్. దానికి కుంకుమ బొట్లు పువ్వులూ!

దాని ఎదుట కూర్చుని ఏవేవో బటన్స్ నొక్కారు పంతులుగారు. టైప్ చేస్తున్నట్టు అర నిమిషంలో ప్రింట్ అవుట్ కాగితం బయటకొచ్చింది. దాన్ని కత్తిరించి చినకోటి చేతిలో పెట్టారు పంతులుగారు.

"మీ నాన్న వారం రోజుల్లో పోతాడు. ఆ తర్వాత నువ్వు స్వర్గ సుఖాలు అనుభవిస్తావ్"

* * * రెండో రోజున లక్ష్మీపతి మరణించాడు.

అయితే అప్పుడే — ఎవరూ ఊహించని మరో సంఘటన జరిగింది.

తండ్రి చనిపోగానే — ఆ మంచం వద్దనే కాచుకుని కూర్చున్న చినకోటి ఆనందం భరించలేక గుండె ఆగి చనిపోయాడు.

* * * పెద్దకర్మ రోజున — డబుల్ తద్దినం భోజనాలు ఆరగిస్తున్న భోక్తలకు పంతులుగారి కంప్యూటర్ జోస్యం చర్చనీయాంశం అయింది.

"అబ్బ! పంతులుగారు ఎంత ఖచ్చితంగా చెప్పారు" అని మెచ్చుకున్నారంతా.

"మొదటి జోస్యం నిజం అయిందిగాని రెండోది..." అని నణిగాడు ఒక సందేహపాణి.

"తండ్రిలాగ తీసుకొని తీసుకొని చావలేదు కదా చినకోటి. అనాయాస మరణం ఎంత సుఖం! డైరెక్టుగా స్వర్గానికేపోయి వుంటాడు! అదృష్టవంతుడు. 'స్వర్గ సుఖాలు అనుభవిస్తావ్' అంటే అర్థం అనాయాస మరణం అనే!" అని వివరించారు అన్నీ తెలిసినవారు! ◆